




# ఈకాలం వార్త

THE HONEST TELUGU DAILY









గురువారం 11-06-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :226 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల


## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

### నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ



నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు.

పేజి 2లో ▶

# ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

**మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము**



ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

÷రిళిదీ రికార్డు..

## బంగారం ధర కంటే రంగారెడ్డిలో భూముల

# ధరలే ఎక్కువ

- ఫ్యూచర్ సిటీ ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామన్న సీఎం.
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం.
- బంగారం కంటే రంగారెడ్డి భూముల ధరలు ఎక్కువని వ్యాఖ్య.
- ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్రలని ఆరోపణ.
- చెరువుల పునరుద్ధరణ, అక్రమ కట్టడాల తొలగింపుపై దృష్టి.



హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఋఌత్ష్ట =వఌఌఎ) అన్నారు. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. “హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు.

పేజి 2లో ▶

## స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా

# జగన్‌కు అర్హత లేదు

- స్టీల్‌ప్లాంట్‌పై జగన్‌కు మాట్లాడే అర్హత లేదన్న అనిత.
- సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లలేదని విమర్శ.
- కార్మికుల సమస్యలపై జగన్ స్పందించలేదని వ్యాఖ్య.
- మృతుల కుటుంబాలకు రూ.కోటికి పైగా పరిహారం.
- ప్రమాదాలపై రాజకీయ విమర్శలు తగవని అనిత సూచన.




2లో

## మంత్రి చెప్పినా వినరా?..

**తెనాలి మున్సిపల్ అధికారులపై నాదెండ్ల ఆగ్రహం**



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తూర్పు కాల్వకట్ట రోడ్డులో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండ్రోజుల క్రితం ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే వ్యర్థాలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

పేజి 2లో ▶

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

- జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం



- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## భారతీరాజా మృతికి సిఎం రేవంత్ సంతాపం



నటుడు, దర్శకుడు పద్మశ్రీ భారతీరాజా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా దర్శకుడిగా, నటుడిగా విశేష ఖ్యాతి గడించారని ముఖ్యమంత్రి గారు గుర్తుచేసుకున్నారు. ఎన్నో వైవిధ్యభరితమైన, సందేశాత్మక చిత్రాలను వివిధ భాషల్లో తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. భారతీరాజా మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

- 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది.

## ఉత్తర-దక్షిణ భావన దేశానికి ప్రమాదకరమన్న పవన్.

- సీఎం హోదాలో ప్రాంతీయ వ్యాఖ్యలు తగవని సూచన.
- విభజనవాదం దేశానికి మంచిది కాదని వ్యాఖ్య.
- యువతకు హేతుబద్ధ నాయకత్వమే కావాలన్నారు.
- ఏపీకి రూ.7,707 కోట్ల కేటాయింపుపై కేంద్రానికి కృతజ్ఞతలు.



# సంపాదకీయం

## విపక్షాలకు ఒకే మాట, ఒకే బాట ఏదీ?

ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వాడిపోయిన ముఖంతో కనపడ్డ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గట్టిగా హత్తుకున్నారు. ఒక స్త్రీ మనసును మరో స్త్రీ తప్ప మరెవరు అర్థం చేసుకోగలరు? 'కొన్ని దృశ్యాలను మాటల్లో చెప్పలేం' అని సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు మహిళలను గతంలో అంతర్జాతీయ సంస్థలు దేశంలోనే అత్యంత శక్తిమంతమైన నేతలుగా అభివర్ణించాయి. సోనియా పది సంవత్సరాలకు పైగా దేశ రాజకీయాలను శాసిస్తే, మమతా బెనర్జీ 15 సంవత్సరాలు బెంగాల్ రాజకీయాలను శాసించారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారికి తెలియనిది కాదు.

గత నెలలో వెలువడిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ వ్యతిరేక శక్తులు మళ్లీ ఢిల్లీలో సమావేశమయ్యాయి. నిన్నటి వరకూ తాము కాంగ్రెస్‌ను కూడా ఢీకొన్న విషయాన్ని మరిచిన మమతా బెనర్జీ, వామపక్షాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై రాహుల్‌గాంధీ ఇటీవలే తనను తీవ్రంగా విమర్శించిన విషయాన్ని మమతా బెనర్జీ మరిచిపోయినట్లే కనపడుతోంది. 'దేశంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఇక జాతీయ స్థాయిలో నేనే కీలక పాత్ర పోషిస్తాను' అని 2021లో ప్రధానమంత్రి పదవి గురించి కలలు కన్న విషయం కూడా ఆమెకు ఇప్పుడు గుర్తుండే అవకాశాలు లేవు.

1998లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కోల్‌కతాలో ఏఐసీసీ ప్లీనరీ జరుగుతున్నప్పుడు ర్యాలీ నిర్వహించి పార్టీని ప్రకటించిన బెబ్బులి మమతా బెనర్జీ ఇప్పుడు కోరలు తీసేసినట్లే కనపడుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో తృణమూల్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆమెపైనే తిరుగుబాటును ప్రకటించారు. ఆమె కుడిభుజం అభిషేక్ బెనర్జీ. ఎంపీ కల్యాణ్ బెనర్జీ తదితర తృణమూల్ నేతలపై వీధుల్లో దాడులు జరుగుతున్నాయి. మమత ఒకప్పుడు ప్రత్యర్థులపై అవలంబించిన విధానాలే ఇప్పుడు ఆమెపై ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. కోల్‌కతా వీధుల్లో ఇప్పుడు మమతా బెనర్జీ, ఆమె వర్గీయులు అరణ్య రోదన చేస్తుంటే వారికి అండగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలే నిలిచే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు ఢిల్లీలోనూ బీజేపీ వంటి మహాశక్తిని ఎదుర్కోవాలంటే కాంగ్రెసే శరణ్యమని మమతా బెనర్జీ గ్రహించినట్లు కనపడుతోంది.

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు సీట్లు పెద్దగా గెలుచుకోనప్పటికీ తృణమూల్‌ను బాగా దెబ్బతీయగలిగాయి. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర్ దినాజ్‌పూర్ లాంటి మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్--వామపక్ష కూటమి తృణమూల్‌కు సంప్రదాయంగా లభించే మద్దతు రాకుండా చూశాయి. 50శాతానికి పైగా ముస్లింల జనాభా ఉన్న 32 అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. జంగీపూర్ అనే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 31వేల ఓట్లు రాగా తృణమూల్ అభ్యర్థికి 10,542 ఓట్లు మాత్రమే లభించాయి. అదే కరండిఘి అనే నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు 39వేల ఓట్లు రాగా, ఆ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 20వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. బహుశా ఈ ఫలితాలు వచ్చిన తీరు మమతా బెనర్జీకి తన అహంకారం, దౌర్జన్యపూరిత ధోరణి, మిత్రపక్షాలను లెక్కచేయనితనం గురించి గుణపాఠాలు నేర్పే ఉంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనపడుతున్నారు.

ఇక దేశంలో తమ కాళ్ల కింద నేల క్రుంగిపోతున్న వామపక్షాలకు కూడా ఢిల్లీ వీధులే శరణ్యంగా మారాయి. 140 సీట్లున్న కేరళ అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 100 సీట్లకు పైగా గెలుచుకోవడం, బీజేపీ మూడు సీట్లు గెలుచుకోవడం, పినరయి విజయన్ కేబినెట్‌లో అత్యధిక మంత్రులు పరాజయం పాలుగావడం విస్మరించదగ్గ విషయం కాదు. అక్కడ కూడా పినరయి విజయన్ పదేళ్ల కేంద్రీకృత అహంకార పాలన, రైతులు, యువత, ఆశా వర్కర్లు తీవ్ర నిరుత్సాహానికి గురికావడం, పార్టీ కేడర్ అసంతృప్తి... వంటివి వామపక్ష కూటమి పరాజయానికి కారణమని విశ్లేషకులు అభివర్ణించారు. పినరయి విజయన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విజయన్‌పై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఏమైతేనేం అయిదు దశాబ్దాల తర్వాత దేశంలో ఎక్కడా అధికారంలో లేని పరిస్థితికి వచ్చిన వామపక్షాలు బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేయడం తప్ప తమకు మరో మార్గం లేదని గ్రహించాయి. ఇండియా కూటమి సమావేశానికి హాజరైన వామపక్ష నేతలు డి.రాజా, జాన్ బ్రిటాస్‌కు ఆ స్పష్టత ఉన్నది.

దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితిని రెండేళ్ల క్రితం మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాగా అర్థం చేసుకున్నారు. సీపీఐ(ఎం) బహిష్కరించిన ప్రసేనజిత్ బోస్‌ను కాంగ్రెస్ తన పార్టీలో చేర్చుకున్నప్పుడు 'మీ కామ్రేడ్‌ను మేము మా పార్టీలో చేర్చుకున్నాం' అని రాహుల్‌గాంధీ ఏచూరితో పరిహాసమాడారు. 'మీ వాడు, మా వాడు అనేది ఏముంది, ఈ పోరులో మనమిద్దరమూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం' అని ఏచూరి నవ్వుతూ జవాబిచ్చారు. దేశంలో బీజేపీ అడ్డూ ఆపూ లేకుండా దూసుకువస్తున్న పరిస్థితుల్లో ఆ పార్టీని ఎదుర్కొనేందుకు అన్ని బీజేపీ వ్యతిరేక శక్తులూ సంకుచిత ధోరణి వీడి కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ఎప్పుడో గ్రహించారు. ఇవాళ ఎన్డీఏలో ఉన్న పార్టీలేవీ ఎన్నికల్లో పరస్పరం పోటీపడడం లేదు. కానీ ఇండియా కూటమిలో ఉన్న పార్టీలకు ఆ మేరకు సమైక్యత లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన 23 పార్టీలకు ఎంత మేరకు లక్ష్యశుద్ధి ఉన్నది? డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు హాజరు కాకపోవడంలో మర్మం ఏమిటి? ఎమర్జెన్సీ అనంతరం 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఒకే ఎన్నికల గుర్తుపై జనతా పార్టీ పేరుతో పోటీ చేశాయి. అప్పటి చిత్తశుద్ధి, పోరాట స్ఫూర్తి ఇప్పుడు ఎన్ని పార్టీలకు ఉంది? మిత్రపక్షాలను కూడా తన సైద్ధాంతిక బాటలో నడిపించగలిగిన బీజేపీ మాదిరి కాంగ్రెస్ ఇతర పార్టీలకు సారథ్యం వహించగలదా?

ఇండియా కూటమి సమావేశం జరిగిన రెండు రోజుల తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశాన్ని ఏర్పరిచారు. పేరుకు ఇది ఎన్డీఏ సమావేశమైనా, జరుగుతోంది బీజేపీ సమావేశమే. నాగాలాండ్, మేఘాలయ, పుదుచ్చేరి వంటి చిన్న రాష్ట్రాలను పక్కన పెడితే ఎన్డీఏ పాలన అమలులో ఉన్న అతి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. నిన్నమొన్నటి వరకు బిహార్‌లో జనతాదళ్(యు) అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఇప్పుడు అక్కడ కూడా బీజేపీ నేతే ముఖ్యమంత్రిగా ఉన్నారు. నితీశ్ రాజ్యసభకు రావడంతో లోక్‌సభలో ఉన్న 12 మంది జేడీ(యు) ఎంపీలకు మోదీయే నాయకుడుగా భావించవలసి ఉంటుంది. లోక్‌సభలో 28 మంది తృణమూల్ ఎంపీలు ఉండగా, ఆ పార్టీ చీఫ్ విప్ కాకోలీ ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపీలు మమతా బెనర్జీపై తిరుగుబాటు చేసి తమను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించమని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించారు. వీరు కూడా ఏ సుముహూర్తాన్నో బీజేపీలో చేరి, ఆ పార్టీ ఎంపీలుగా కాషాయ కండువా కప్పుకోక తప్పదు. అంటే బీజేపీకి తెలుగుదేశం ప్రమేయం లేకుండానే ఇప్పటికే లోక్‌సభలో పూర్తి మెజారిటీ వచ్చినట్లే లెక్క.

అంతేకాక శివసేనకు చెందిన ఏడుగురు, లోక్ జనశక్తికి చెందిన అయిదుగురు, జనతాదళ్ సెక్యులర్‌కు చెందిన ఇద్దరు, రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెందిన ఇద్దరు, ఎన్సీపీ పవార్ గ్రూప్‌కు చెందిన ఒక్కరు, అప్నాదళ్, హిందూస్థానీ ఆవామీ మోర్చాకు చెందిన ఇద్దరితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఇప్పటికే బీజేపీకి మద్దతునిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక శివసేన, ఎన్సీపీ, లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక సమతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ వంటి పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన ఘనత, పలువురు ఇతర పార్టీల నేతలను తమతో పాటు కలుపుకున్న ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కింది. అంతే కాదు, మోదీ హయాంలోనే బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకేతో పాటు పలు ప్రాంతీయ పార్టీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. మోదీకి దాసోహం అనకపోతే తమ మనుగడ కష్టమని పలు ప్రాంతీయ పార్టీలు భావించే పరిస్థితి దేశంలో నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన నేడు 13వ సంవత్సరంలోకి

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

మొదటిపేజీ తరువాయి

మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016-17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు.

గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ పక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ÷ునరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్‌స్టలెంట్ సంస్థ , ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని ఆయన తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ పక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన స్కార్ డెప్త్, కట్-ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో మెడిగడ్డతో పాటు అన్ని బ్యారేజీలను పునరుద్ధరిస్తాం. తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టులను తిరిగి సురక్షితంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకువస్తాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్డీయే ప్రభుత్వానికి 12 ఏళ్లు.. ఢిల్లీలో కీలక భేటీ.. హాజరైన చంద్రబాబు, పవన్



ఢిల్లీ: దేశ రాజధానిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల కీలక సమావేశం జరుగుతోంది. ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ భేటీకి భాజపా, మిత్రపక్షాల ముఖ్య నేతలు హాజరయ్యారు. కేంద్రమంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు భేటీలో పాల్గొన్నారు. ప్రధానిగా ఎక్కువకాలం కొనసాగిన మోదీకి అభినందనలు తెలుపనున్నారు. మోదీకి అభినందనలపై ప్రత్యేక తీర్మానాన్ని ఏపీ సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టనున్నారు. దీనికి నాగాలాండ్ సీఎం నెఫీ రియో మద్దతు తెలుపుతారు. అనంతరం ఎన్డీయే నేతలను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడనున్నారు.

## అమరావతికి కీలక ప్రాజెక్టు.. కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు

అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో 'సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామిడేషన్' ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్‌కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఏపీలో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉనికిని బలోపేతం చేయడానికి, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచి పౌరులకు మరింత సమర్థవంతంగా సేవలను అందించడానికి ఈ కీలక నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. అనేక కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే తాటిపైకి తీసుకురావడం ద్వారా.. పాలన సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఇది రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి ఆకాంక్షలకు గణనీయమైన సహకారాన్ని అందిస్తుందన్నారు.

ఏపీలో ప్రపంచస్థాయి పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిరంతర మద్దతుకు ఇది నిదర్శనమని తెలిపారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.

## స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా

# జగన్‌కు అర్హత లేదు

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం(వన్‌టౌన్): స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన కార్మికులను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్ ఆస్పత్రికి వచ్చినా ఆయన పార్టీ కార్యకర్తలు ఏవేవో నినాదాలు చేశారని విమర్శించారు.

"సీఎం హోదాలో జగన్ ఎప్పుడైనా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లారా? అక్కడి కార్మికుల సమస్యల గురించి మాట్లాడారా? మృతుల కుటుంబాలకు స్టీల్‌ప్లాంట్, కేంద్రం, రాష్ట్రం పరిహారం ఇచ్చాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి కంటే ఎక్కువ పరిహారం అందుతుంది. చనిపోయిన ఒప్పంద కార్మికుల కుటుంబానికి కూడా పరిహారం, ఉద్యోగం ఇస్తున్నాం. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయంగా విమర్శలు సరికాదు"అని మంత్రి అనిత అన్నారు.

# ఉత్తర--దక్షిణ భావన దేశానికి ప్రమాదకరమన్న పవన్.

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. దిల్లీలో ఓ పాడ్‌కాస్ట్‌లో పవన్ మాట్లాడుతూ.. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు.

"విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా"అని పవన్ తెలిపారు.

**కేంద్రానికి పవన్ కృతజ్ఞతలు**

వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మంత్రి చెప్పినా వినరా?..

## తెనాలి మున్సిపల్ అధికారులపై నాదెండ్ల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి


బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన మంత్రి.. వ్యర్థాలు తొలగించకపోవడాన్ని గమనించి మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను ఘటనాస్థలికి పిలిపించి ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. చెత్త కుప్పలు ఎక్కువగా ఉన్నాయని.. టెండర్ పిలిచి తొలగిస్తామని మున్సిపల్ సిబ్బంది సమాధానం చెప్పారు.

మున్సిపాలిటీ జేసీబీ, ట్రాక్టర్లతో చేయాల్సిన పనికి టెండరా? అని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవుపెట్టి వెళ్లండని హెచ్చరించారు. వ్యర్థాలు తొలగించే వరకు ఇక్కడే ఉంటానని కాల్వగట్టుపై ఉన్న బల్లపై కూర్చున్నారు. దీంతో హడావుడిగా అక్కడికి చేరుకున్న మున్సిపల్ యంత్రాంగం.. చెత్త తొలగింపు పనులు చేపట్టింది.

## బంగారం ధర కంటే రంగారెడ్డిలో భూముల

# ధరలే ఎక్కువ

మొదటిపేజీ తరువాయి



రాష్ట్ర ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుంచే వస్తుంది. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా? ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదు.

**రోడ్లపై నీరు.. బాధ్యులెవరు?**

నిన్న వర్షానికి రోడ్లు మొత్తం వరద నీటితో నిండిపోయాయి. రోడ్లపై వరద పారుతుంటే.. దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? చెరువుల్లోకి వెళ్లాల్సిన నీరు కబ్జాల వల్ల రోడ్లపైకి వస్తోంది. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# చెత్తను పక్కాగా వేరు చేయాలి

- పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి
- పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి
- ట్రాఫిక్ నియమాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహణ





ఈకాలం

ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా పక్కాగా వేరు చేయాలని, పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, ఆయిల్ పామ్, రోడ్డు భద్రత, నియమాలు, గిరిజన సంక్షేమ శాఖ పథకాలు తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6వ తేదీన ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా 10 థీమ్ లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ -2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్తగా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు ఉండవని వివరించారు. ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 25 వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యువతకు మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సులలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారని, 18 నుంచి 35 ఏండ్ల లోపు వారు పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని.. ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటుతూ.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థులందరికీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మానాల గ్రామస్థులంతా ప్రభుత్వ బడికి కే పిల్లలను పంపిస్తామని తీర్మానించడంపై అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని, ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, ప్రవేశాలు పెరగాలని పేర్కొన్నారు. మానాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. మొక్కలు నాటాలని.. పచ్చదనం పెంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు దూరం చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం స్థానిక వనరుల నుంచి ఇసుక తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేస్తున్న కృషిని అభినందించారు. మారుమూల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహణ పై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, మిషన్ భగీరథ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ విద్యాలయం పనుల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో నిర్మాణ పనుల పరిశీలన



ఈకాలం

రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) విద్యాలయం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

రుద్రంగి మండలం గైదిగుట్ట తండా ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ తరగతి గదులు, హాస్టల్ భవనం, ఇతర నిర్మాణ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్, అధికారులు మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పరిశీలనలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంగీత, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు.

ఈకాలం



భారత దేశాన్ని జోహార్ లాల్ నెహ్రూ 4398 రోజులను దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన రికార్డును సుమారు 60 సంవత్సరాల తర్వాత నేడు నరేంద్ర మోడీ అధిగమించిన శుభ తరుణంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశ ఆర్థిక అభివృద్ధికి మరెన్నో సంస్కరణలు ప్రజల అభివృద్ధి కోసం విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకోవడానికి తగిన శక్తినీ ఇవ్వాలని మోడీ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని మరింత ఉత్సాహంతో దేశాన్ని ముందుకు నడిపించాలని ముస్తాబాద్ మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని మంగలి గడ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లెల్ల మల్లేశం ,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్ , కసోడి రమేష్ ,వరి వెంకటేష్ తన్నీరు ప్రభాకర్ రావు మొర్రాయిపల్లె సర్పంచ్, మొంగని శ్రీనివాస్, మీసా స్వామి,చిట్టినేని శ్రీనివాస్ రావు,పప్పుల శ్రీకాంత్ యాదగిరి,కటకం మహేష్, ఆకాష్ తదితరులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలి...

- ఈనెల 14న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు: కరపత్రం విడుదల..

ఈకాలం

గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని దినాలు కల్పించాలని, పని వేదికల వద్ద రెండుసార్లు ఫోటోలు తీసే 'వి బి జి రాంజీ' విధానాన్ని వెంటనే రద్దు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పాత విధానాన్ని పునరుద్ధరిస్తూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేరునే యథావిధిగా కొనసాగించాలని కోరింది. బోయినపల్లి మండలం రత్నంపేట గ్రామంలో వ్యవసాయ, ఉపాధి హామీ కూలీల ఆధ్వర్యంలో బుధవారం ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 14వ తేదీ (ఆదివారం) జిల్లా కేంద్రమైన సిరిసిల్లలోని మున్సిపల్ ఆఫీస్ పక్కన ఉన్న చేనేత వస్త్ర భవన్‌లో నిర్వహించబోయే "జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మూడవ మహాసభల" గోడపత్రిక వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అట్టడుగు వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీలు అతి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నో ఏళ్లుగా నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనుల వద్ద రెండుసార్లు ఫోటోలు తీసే నిబంధనను తెచ్చి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. ఈ తుగ్లక్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు.



జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్‌తో పాటు రత్నంపేట గ్రామ వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి:డీఎస్పీ

ఈకాలం



వేములవాడలో "నషా ముక్త్ తెలంగాణ - హరిత తెలంగాణ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు,యువత కలిసి మొక్కలు నాటారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవరుచుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్య క్రమంలో పోలీసు అధికారులు, యువ ఫౌండేషన్ ప్రతినిధులు,యువత పాల్గొన్నారు.

# జాతీయ ప్రతిజ్ఞ రచయితకు ఘన నివాళి



ఈకాలం

వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు,విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..విద్యార్థుల్లో దేశభక్తి కోసం పైడిమర్రి 1962లో ప్రతిజ్ఞను రచించారని, ఆయనకు తగిన గుర్తింపుతో పాటు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

# కనగర్తి నూతన గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ తాళం..!



ఈకాలం
కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ అండెం మల్లారెడ్డి తాళం వేశారు..గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా తనకు రావాల్సిన రూ.1.50 లక్షల బిల్లు ఇప్పటికీ చెల్లించలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు..అప్పటి సర్పంచ్, వార్డు సభ్యులు అధికారులు బిల్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం వల్ల తాను నష్టపోయానని వాపోయారు..తనకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అధికారులను వేడుకుంటున్న మల్లారెడ్డి, బిల్లు చెల్లించిన తర్వాతే గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించుకోవాలని స్పష్టం చేశారు..ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారగా, సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది..గ్రామాభివృద్ధి కోసం నిర్మించిన పంచాయతీ భవనం... ఇప్పుడు బకాయిల వివాదంతో వార్తల్లో నిలిచింది...రెండు సంవత్సరాలుగా బిల్లు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఏకంగా భవనానికి తాళం వేయడం కలకలం రేపుతోంది. తనకు రావాల్సిన రూ.1.50 లక్షలు చెల్లించే వరకు భవనం ప్రారంభించవద్దని కాంట్రాక్టర్ తెలిపారు...

# పిల్లలతో కలిసి తండ్రి అదృశ్యం చందుర్తిలో కేసు నమోదు...

ఈకాలం
కుటుంబ మనస్పర్థల నేపథ్యంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఓ తండ్రి అదృశ్యమైన సంఘటన చందుర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జె. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మల్యాల గ్రామానికి చెందిన దురిశెట్టి అనిల్ ఈనెల 9న మధ్యాహ్నం తన పిల్లలు మహేశ్వరి (6), మనస్వి (5)లను కారు (ఫ్రా 15 దీసీ 1459)లో కరీంనగర్ పార్కుకు తీసుకెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. సాయంత్రం గడుస్తున్నా వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన అనిల్ తమ్ముడు అనుదీప్, అన్నయ్య మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌గా వచ్చింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. గత కొంతకాలంగా అనిల్‌కు అతని భార్యతో కుటుంబ మనస్పర్థలు నడుస్తున్నాయని, ఈ క్రమంలోనే పిల్లలను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయి ఉంటాడనే అనుమానంతో తమ్ముడు అనుదీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

# 'పెద్ది' టికెట్ ధరల పెంపు.. తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటిషన్



హైదరాబాద్: తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయెల్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. 'పెద్ది' టికెట్ ధరల పెంపునకు హోంశాఖ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. 10 రోజులపాటు టికెట్ ధరలు పెంచుకునేలా ఈ నెల 2న హోంశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి మెమో ఇచ్చారని దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. హోంశాఖ జారీ చేసిన మెమో అక్రమమని స్పష్టం చేసింది. టికెట్ ధరల పెంపు విషయంలో జీవో 121ను అనుసరించాలని సూచించింది. హోంశాఖ నుంచి వివరాలు సేకరించడానికి సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీంతో తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 15కి వాయిదా వేసింది.

# తెలంగాణ పథకాలు దేశానికే రోల్ మోడల్: విప్ ఆది శ్రీనివాస్...







**– వేములవాడ మున్సిపాలిటీతో పాటు మల్లారం గ్రామ సభల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ...**

ఈకాలం
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఆశయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11, 24 వార్డుల్లో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభల్లో వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సభలో వర్షాకాల ముందస్తు చర్యలు, జల సంరక్షణ, వన మహోత్సవం, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, పంటల మార్పిడి, ఓటరు జాబితా సవరణ, మహిళల రక్షణ, భరోసా కేంద్రం తదితర అంశాలపై ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడానికే ఈ ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రైనేజీలను ముందే శుభ్రం చేయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని ప్రజలను కోరారు.ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఆది శ్రీనివాస్ కొనియాడారు.ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్.. తెలంగాణలో అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై, అలాగే కేరళ ముఖ్యమంత్రి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మొదటి సంతకాలు చేయడం మన పథకాల విశిష్టతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో తాము చేపట్టిన కుల గణన చూసే.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దిగివచ్చి దేశంలో జనగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో కేవలం బేస్ మెంట్, గోడలు కట్టుకుని ఆగిపోయిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల కింద ఆర్థిక సహాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. త్వరలోనే రెండో దశ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాల వంటి లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా సిద్దిపేట జిల్లా నర్మెటలో పరిశ్రమ అందుబాటులో ఉందన్నారు. జగిత్యాల జిల్లా పొలస తరహాలోనే మర్రిపల్లిలో 40 ఎకరాల్లో ప్రత్యేక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను రూ. 150 కోట్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామని విప్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఈ పనులకు శంకుస్థాపన చేశారని, మరో వెయ్యి ఏళ్లపాటు ఆలయం చెక్కుచెదరకుండా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కేఎస్పీ కుమారి, మున్సిపల్ కమిషనర్ లోకేష్, డీఎస్పీ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మి రాజం, మల్లారం సర్పంచ్ అర్పితా రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు,విభిన్న శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: జిల్లా ఎస్పీ.

**భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.**





ఈకాలం
బుధవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారు అధికారులు,సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు మరియు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు విస్తృత స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రవి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న కేడీసీసీబీ ఉద్యోగులకు ఘన సన్మానం...



ఈకాలం
కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కేడీసీసీబీ వేములవాడ శాఖలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను బుధవారం వేములవాడ ప్యాక్స్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న బ్యాంకు సిబ్బంది అరుణ్ కుమార్, ఝాన్సీ, శ్రీకాంత్‌లను శాలువాలతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ, సహకార రంగ ఉద్యోగాలలో బదిలీలు సహజమని పేర్కొన్నారు. వేములవాడ శాఖలో పనిచేసిన కాలంలో ఈ ముగ్గురు ఉద్యోగులు ఎంతో బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించారని కొనియాడారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని గౌరవించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు రాజయ్య, సంజీవరెడ్డి, కొండ శేఖర్, అమృత, సీఈఓ లక్ష్మణ్, మాజీ డైరెక్టర్లు గుడిసె సదానందం, రాచర్ల మహేందర్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విజయ్ పవన్, ఉద్యోగులు సతీష్, శ్వేత, లావణ్య, అంజలి, విమల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149